క్లుప్తంగా

12న మండల పరిషత్ సమావేశం

జరుగుమల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ బెల్లం నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.జలజాక్షి తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్య భద్రత


వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ లీనా రాఫెల్

జరుగుమల్లి: ప్రతి పేద కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని డాక్టర్ లీనా రాఫెల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని తూమాడు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 84 మందిని పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది చంద్రశేఖర్, శ్రావణి, అనూష, సురేష్ పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.87 వేలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.87,361 ఆదాయం వచ్చినట్లు ఆలయ చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఈఓ జి.రమణారెడ్డి తెలిపారు. స్వామి దర్శనం టిక్కెట్ల అమ్మకం ద్వారా రూ.42,360, లడ్డు ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.20,965, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదానం పథకం నిర్వహణకు రూ.21,560 వేలు, ఇతర విరాళాలు రూ. 2,516 ఆదాయం వచ్చినట్లు ఈఓ, చైర్మన్లు తెలిపారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ


విజేతలకు క్రీడా దుస్తులు పంపిణీ చేస్తున్న చెంచిరెడ్డి

జరుగుమల్లి: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల్లో కె.బిట్రగుంట సచివాలయ పరిధిలోని బాలురు ప్రతిభ చాటారు. వాలీబాల్, క్రికెట్, ఖోఖో, బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలకు టీ షర్టులు, క్యాప్‌లను వైఎస్సార్ సీపీ గ్రామ నాయకుడు కుండా చెంచిరెడ్డి సోమవారం పంపిణీ చేశారు. మండల స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.భాస్కరరెడ్డి, కె.వెంకారెడ్డి, కె.జైపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు హెప్సిబా, శ్రీనివాసులు, సచివాలయ డిజిటల్ సహాయకులు సందీప్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

కనిగిరి రూరల్: అమిగోస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ సంజీవి మాట్లాడుతూ అమిగోస్ ఫౌండేషన్ సేవాహిత కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. విద్యారంగ అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు, యువత భాగస్వామ్యులు కావడాన్ని కొనియాడారు. ఫౌండేషన్ సభ్యులు ఎస్ నారాయణ, నారాయణ గుప్తా, తిరుపతిరెడ్డి, జేమ్స్, సురేష్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్య


ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న డీవైఈఓ అనితారోజ్‌రాణి

సింగరాయకొండ: విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు అందిస్తోందని డీవైఈఓ టి.అనితారోజ్‌రాణి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 9, 10వ తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను సబ్జెక్టుల వారీగా తనిఖీ చేశారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులకు తగిన సూచనలిచ్చారు.

ఘనంగా సంక్రాంతి ముందస్తు సంబరాలు


నృత్యాల ప్రదర్శనలో విద్యార్థులు


కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆటల్లో విద్యార్థులు


తిమ్మరాజుపల్లెలో సంక్రాంతి సంబరాల్లో వేషధారణలో విద్యార్థులు


కె.అగ్రహారంలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు


నర్రమారెళ్లలో హరిదాసు వేషంలో విద్యార్థి

సీఎస్‌పురం(పామూరు): సంక్రాంతి ముందస్తు సంబరాలు మండలంలోని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిమ్మరాజుపల్లె ఎంపీపీఎస్‌లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల వేషధారణలు అలరించాయి. ముళ్లపాడు ఎంపీపీఎస్‌లో కూడా భోగిమంటలు, హరిదాసుల వేషధారణలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మండలంలోని పలుపాఠశాలల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఎంఈఓలు జగన్నాథం ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి సందర్శించారు.

కనిగిరి రూరల్: మండలంలోని ఏరువారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. పాఠశాలలోని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా, ఆనందంగా సంక్రాంతి ముగ్గుల పోటీల్లో పాల్గొని రకరకాల రంగులు అద్ది ముగ్గులను సింగారించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి మంటలు, హరిదాసు వేషధారణలు, కోలాటం, పలు రకాల ఆటల ప్రదర్శనలు జరిగాయి. కార్యక్రమాల్లో విద్యార్థులతో పాటు గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతల చెరువు సత్యన్నారాయణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి ఆర్థిక సౌజన్యంతో పాఠశాలలోని విద్యార్థులకు క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎస్‌కే ముంతాజ్ బేగం మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు తెలుగు సాంప్రదాయ, సంస్కృతిలకు దర్పణమని కొనియాడారు. ముందస్తు సంక్రాంతి సంబరాలతో పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఎంతో సంతోషం నెలకొందన్నారు. సర్పంచ్ దమ్ము వెంకటయ్య, విశ్రాంత ఎంఈఓ నాగిరెడ్డి, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, పీడీ హజరత్‌రెడ్డి, గురుప్రసాద్, మస్తాన్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీసీపల్లి: మండల పరిధిలోని నేరేడుపల్లి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం టి.అంజలి దేవి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సంక్రాంతి పండుగ, భోగి, కనుమ పండుగల విశిష్టతను తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసుల వేషధారణలో అలరించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

కనిగిరి రూరల్: కనిగిరి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో, చింతపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా వివిధ రకాల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు, కోలాటం ప్రదర్శన, పతాంగులు ఎగుర వేయడం వంటి పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్లోని విజేతలకు రాజ్యలక్ష్మి మెడికల్స్ అధినేత వాగిచర్ల వెంకటేశ్వర్లు, బంగారు వ్యాపారి మహేష్, హెచ్‌ఎంలు కలువ విజయలక్ష్మి బహుమతులు అందచేశారు. చింతలపాలెం పాఠశాలలో హెచ్‌ఎం రామశర్మ విజేతలకు బహుమతులిచ్చారు.


కనిగిరి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

వెలిగండ్లలో..

వెలిగండ్ల: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమవారం ముందస్తున్న సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వెలిగండ్ల హైస్కూల్‌లో ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కె.అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. విద్యార్థులు భోగిమంటలు వేశారు. కంకణంపాడు, మొగళ్లూరుపల్లి తదితర పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఎంఈఓలు దాసుప్రసాద్, దేవిరెడ్డి రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: మండలంలో ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నర్రమారెళ్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఎస్‌కే.మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గుల పోటీలు, పలువిధాల ఆటల పోటీలు, పిండి వంటల ప్రదర్శనలు నిర్వహించారు. అనంతరం వేడుకగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగిమంటలు వేశారు. పాఠశాల ఉపాధ్యాయులు తోట రమేష్, నెల్లూరి సీరజ, సుజాత, డి.నాగేశ్వరరావు, బి.కోటేశ్వరరావు, ఎస్‌వి.ప్రసాద్, ఇ.వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


కలికవాయ ప్రాథమికోన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

సింగరాయకొండ: మండలంలోని కలికవాయ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు నిడమానూరి సురేంద్ర ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతం గాలిపటాలు ఎగురవేయించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.


సీఎస్‌పురం: హరిదాసు వేషధారిగా విద్యార్థి

కొండపి(సింగరాయకొండ): కొండపి మండలం కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయుడు సుశస్‌కుమార్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, ఆటల పోటీలు, లెమన్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ రాఘవశర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కనిగిరి: క్రీడా దుస్తులు అందచేస్తున్న హెచ్‌ఎం ముంతాజ్ బేగం


నేరేడుపల్లిలో సంక్రాంతి సంబరాలు


నర్రమారెళ్లలో ముందుస్తు భోగిమంటలు


కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముగ్గుల పోటీలు

ముస్లిం మైనారిటీలకు అండగా సీఎం జగన్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న షేక్ సలీంబాషా, ముస్లిం నాయకులు

సింగరాయకొండ: ముస్లిం మైనారిటీల సంక్షేమం కోసం అండగా నిలిచిన వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, చంద్రబాబునాయుడు ఏమాత్రం కాదని మండలంలోని ముస్లిం మైనారిటీ నాయకులు తేల్చిచెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు షేక్ సలీం బాషా మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ముస్లింలకు తీవ్ర అన్యాయం జరిగిందని, మండలంలో అభివృద్ధి మొత్తం టీడీపీ హయాంలో జరిగిందని ఆ పార్టీ ఎమ్మెల్యే స్వామి చెప్పడాన్ని తీవ్రంగా ఖండించారు. వాస్తవానికి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆటో నగర్ ఏర్పాటు చేయకుండా అడ్డుకున్నారని, ఆ స్థలంలో మట్టిని తవ్వి టీడీపీ నాయకులు అమ్ముకుని కోట్లాది రూపాయలు సంపాదించుకున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో ఒక్క ముస్లింకు కూడా ఇంటి స్థలం ఇవ్వలేదని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 267 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారన్నారు. మోదీ ప్రభుత్వంలో రూర్బన్ పథకం క్రింద రూ.100 కోట్లు నిధులు వస్తే రోడ్లు వేశారే తప్ప కాలువలు నిర్మించలేదన్నారు. ముస్లిం సామాజికవర్గానికి చెందిన వ్యక్తికి ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. మైనారిటీ నాయకుడు షేక్ పటేల్ మాట్లాడుతూ.. మంత్రి సురేష్‌ను వలస పక్షి అని ఎమ్మెల్యే డోలా విమర్శించారని, ఆయనే దామచర్ల కుటుంబానికి బానిస పక్షి అని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సామంతల రవికుమార్‌రెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీం జాయింట్ సెక్రటరీ షేక్ నౌషాద్, బీసీ సెల్ సెక్రటరీ షేక్ సుల్తాన్ బాషా, మాజీ ఎంపీటీసీ షేక్ సలీం తదితరులు పాల్గొన్నారు.

ఫ్లవర్, ఫ్రూట్ గార్డెన్లు ప్రారంభం


కళాశాల ప్రాంగణంలో ఫ్రూట్, ఫ్లవర్ గార్డెన్లను వైస్ చాన్సలర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి

కందుకూరు రూరల్: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఫ్రూట్, ఫ్లవర్ గార్డెన్లను ఆంధ్ర కేసరి విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ డాక్టర్ ఎం.అంజిరెడ్డి సోమవారం ప్రారంభించారు. కళాశాలలో హరిత కార్యక్రమాలను అభినందించారు. అలాగే ఆంధ్రకేసరి యూనివర్శిటీ స్పాట్ వాల్యూయేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ప్రిన్సిపాల్ ఎం.రవి కుమార్ మాట్లాడుతూ కళాశాలలో చేపట్టిన వివిధ హరిత కార్యక్రమాలను ప్రోత్సహించడానికి మహారాష్ట్రకు చెందిన గ్రీన్ వియో సొల్యూషన్స్ అనే సంస్థ వారు ఒప్పందం కుదుర్చుకున్నారు. వారు కళాశాలకు వివిధ రకాల పండ్ల మొక్కలను బహూకరించారని, పెంపకానికి తమ సహకారం ఉంటుందని తెలియజేశారన్నారు. గతంలో కళాశాల మౌలిక వసతులు కోసం విరాళాలు అందజేసిన జరుగుమల్లికి చెందిన మున్నంగి సీఫుడ్స్ డైరెక్టర్ రాజశేఖర్, రామారావు, సింగరాయకొండ ఫెరల్ డిస్టిలరీకి చెందిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. కందుకూరుకి చెందిన పెట్రోల్ బంక్ నిర్వాహకులు నారాయణరావు కళాశాలకు 30 పండ్ల మొక్కలను అందజేసినట్లు తెలిపారు. తమ కళాశాలకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ హరిత కళాశాలగా అవార్డు రావడానికి ఈ దాతల సహకారం ఎంతో ఉందని భవిష్యత్‌లో కూడా ఈ హరిత క్యాంపస్‌ను జాగ్రత్తగా కాపాడి కళాశాలకు మంచి పేరు తీసుకొస్తామని చెప్పారు. కృషి విజ్ఞా కేంద్రం హెడ్ జి.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ గార్డెన్‌లను ఏర్పాటు చేయడానికి సహకరించిన దాతలు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వృక్ష శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ ఎస్.తిరుపతి స్వామిని, బాలు నాయక్, వృక్షశాస్త్ర సిబ్బందిని ప్రిన్సిపాల్, దాతలు అభినందించారు. ఎన్ఎస్ఎస్ విభాగం శంకరరావు, కె.నరేష్ రాజా, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

147 మందికి ఉచిత వైద్య సేవలు


మందులు పంపిణీ చేస్తున్న కళాశాల డీన్, డాక్టర్లు, నాయకులు

సీఎస్‌పురం(పామూరు): జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని శీలంవారిపల్లె కదిరి బాబూరావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో కోవిలంపాడు సచివాలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కళాశాల డీన్ డాక్టర్ నున్నా త్రిమూర్తులు, వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్.బుజ్జిలు ప్రారంభించారు. ఈ సందసర్భంగా ప్రముఖ డెంటల్ డాక్టర్ పి.మనోజ్ కుమార్ 147 మందికి ఉచితంగా పంటికి సంబంధిచి వ్యాధులు, ఇతర సమస్యలకు పరీక్షలు నిర్వహించి నాయకులు, విద్యార్థులతో కలిసి ఉచితంగా మందులు అందజేశారు.

ఆర్డీఓ స్పందనకు 19 అర్జీలు

కనిగిరి రూరల్: స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఆర్డీఓ స్పందనకు 19 అర్జీలు వచ్చాయి. కనిగిరి నుంచి 7 అర్జీలు, పీసీపల్లి 1, దొనకొండ 1, కొనకనమిట్ల 3, వెలిగండ్ల 5, మర్రిపుడి 2 అర్జీలను ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్‌కి అందజేశారు. డీఏఓ జయవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్లు పాల్గొన్నారు.

8 మద్యం బాటిళ్లు పట్టివేత

కనిగిరి రూరల్:: పట్టణంలోని సూరాపాపిరెడ్డి కాలనీలో నిర్వహిస్తున్న బెల్టుషాపుపై సోమవారం పోలీసులు దాడి చేశారు. 8 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె. మాధవరావు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

వెలిగండ్ల: మండలంలో రెండు వేర్వేరు ప్రదేశాల్లో అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని, తరలిస్తున్న వ్యక్తులను సోమవారం రాత్రి స్థానిక పోలీసులు పట్టుకున్నారు. అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 20 క్వార్టర్ బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండగా కంకణంపాడు గ్రామం వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే పూలికుంట్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 15 క్వార్టర్ బాటిళ్లను అక్రమంగా తరలిస్తుండా రామగోపాలపురం వద్ద పోలీసులు పట్టుకున్నారు. పట్టుకున్న మద్యం బాటిళ్లను, మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై మహేష్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుత్ చౌర్యంపై దాడులు


తనిఖీలు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

సింగరాయకొండ: మండలంలో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 93 మందికి రూ.3.82 లక్షలు జరిమానా విధించినట్లు ఏడీఈ పి.యుగంధర్ తెలిపారు. సోమవారం విద్యుత్‌శాఖ కందుకూరు ఈఈ ఎం.వీరయ్య, విజిలెన్స్ ఈఈ టి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో 33 బృందాలు దాడులు చేశాయి. 10 మంది ఏఈలు, ముగ్గురు ఏడీఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో ముగ్గుల పోటీలు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12న కనిగిరిలో, 13న పామూరులో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్ రంగనాయకులరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ఈనెల 12న శుక్రవారం ఉదయం 8 గంటలకు కనిగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఆవరణల్లో, 13న పామూరు మండలంలో ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్‌రెడ్డి ఆధ్వర్యంలో పామూరు వెలుగొండ స్వామి ఆలయంలో ముగ్గుల పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతి ఫ్రీజ్, ద్వితీయ బహుమతి గ్రైండర్, తృతీయ బహుమతి మిక్సీ అందజేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9948442714, 9989505475, 9985464157 నంబర్లను సంప్రదించాలని కోరారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎస్సై ఖాదర్‌బాషా

టంగుటూరు: జరుగుమల్లి గ్రామానికి చెందిన కల్లగుంట శ్రీనివాసరావు టంగుటూరులో అక్రమంగా మద్యం అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని 12 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేశామని ఎస్సై ఖాదర్ బాషా సోమవారం తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

కందుకూరు: సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఉన్న మోటార్లు, ఎలక్ట్రికల్ ప్యానల్ బోర్డుల మరమ్మతుల కారణంగా పట్టణంలో రెండు రోజులపాటు మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మున్సిపల్ కమిషనర్ మనోమర్ సోమవారం తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఏఎంసీ ఆవరణలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు పరిధిలో నీటి సరఫరా చేసే దూబగుంట, బిలాల్‌నగర్, బాలాజీనగర్, కృష్ణబలిజ సంఘం, అమలనాథుని వారిపాలెం, కేసరిగుంట కాలనీ, మంగలిపాలెం, పంప్‌హౌస్ ఇఎల్ఎస్ఆర్ సరఫరా అయ్యే పడమటివడ్డిపాలెం, 26వ వార్డులకు నీటి సరఫరా నిలిచి పోతుందని తెలిపారు.

బుధవారం పట్టణం మొత్తం పూర్తిగా నిలిపివేస్తామని, 11వ తేదీ నుంచి యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌కు ఘన నివాళి


బడేవారిపాలెం అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ తదితరులు


గుండ్లపాలెంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ, సచివాలయ సిబ్బంది

● వాడవాడలా జన్ భాగీదారీ

కందుకూరు రూరల్: జన్ భాగీదారీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొండికందుకూరు, విక్కిరాలపేట, కోవూరు గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కొండికందుకూరు సచివాలయంలో సర్పంచ్ కుమ్మర బ్రహ్మయ్య, సచివాలయ సిబ్బంది అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా కోవూరు, విక్కిరాలపేట గ్రామంలో సర్పంచ్ ఆవుల మాధవరావు, సర్పంచ్ ప్రతినిధి గంగవరపు చిన వెంకట్రావు, సచివాలయ సిబ్బంది, నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19న ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంతటా జన్ భాగీదారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మృతి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజం పండిందన్నారు. సామాజిక న్యాయం విషయంలో ఆయన దేశానికి ఆదర్శంగా నిలిచారన్నారు. డీఎల్‌పీఓ కృష్ణమోహన్, ఈపీఆర్డీ చంద్రసేన్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలేటివారిపాలెం: అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తామని ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ రఫీక్ అహ్మద్ అధ్యక్షతన జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు ప్రజా ప్రతినిధులతో అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ సుందరమ్మ నివాళులర్పించారు. బడేవారిపాలెం, పోకూరు, శాఖవరంలో పూలమాలలు వేశారు.

గుడ్లూరు: మండలంలోని అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పులి రమేష్, ఎంపీడీఓ రాజశేఖరరావు, గుండ్లపాలెంలో జెడ్పీటీసీ కోర్సిపాటి బాపిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ కిశోర్, చెమిడిదిపాడులో తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఏఓ రవికుమార్, సర్పంచ్‌లు హైమావతి, అనిత నివాళులర్పించారు.